
పోలీస్‌శాఖలో ఎన్నికల ఎఫెక్ట్
రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేడి అనధికారికంగా ప్రారంభమైంది. ఎన్నికల సమయంలో కీలకపాత్ర పోషించే పోలీస్‌శాఖలో భారీగా మార్పులు చేపడుతున్నారు. - 8లో


ప్రవాహ పరవళ్లు
కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ (లక్ష్మీ), అన్నారం (సరస్వతీ) బ్యారేజీలకు వరద నీరు పోటెత్తింది. దీంతో అధికారులు బ్యారేజీల్లో గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
$27^0 / 24^0$
వాతావరణం
జిల్లాలో వాతావరణం పొడిగా ఉండడంతో పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అటవీశాఖ అధికారులకు దుప్పి అప్పగింత



వాజేడు: సమీప అడవి నుంచి రెండు కుక్కలు దుప్పిని తరుముతుండడంతో భయంతో దుప్పి మండల కేంద్రానికి చెందిన ముడిగె రాజు, తిరుపతి దొడ్లోకి వచ్చి చేరింది. ఆ రెండు కుక్కలతో పాటు గ్రామంలో మరో నాలుగు కుక్కలు దుప్పిపై దాడి చేస్తుండగా ఆ సమయంలో తిరుపతితో పాటు పలువురు దుప్పిని కాపాడి అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు రాగా దుప్పిని అప్పగించారు.

ఇంటింటా సర్వే




వెంకటాపురం(కె): మండల పరిధిలోని పెంకవాగు, కలిపాక, కొత్తగుంపు గ్రామాల్లో శనివారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జ్వర పీడితులపై ఇంటింటా సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు గ్రామాల్లో 645 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. గ్రామాల్లోని ప్రతీ ఇంటికి వెళ్లి ఇంట్లో ఎంత మంది ఉంటున్నారనే వివరాలను తెలుసుకోవటంతో పాటు జ్వరాల బారిన పడి ఎవరైన బాధపడుతున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎదిర వైద్యాధికారులు భవ్యశ్రీ, వెంకటేష్, సిబ్బంది యాకలక్ష్మి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ములుగు రూరల్: భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వంట కార్మికులు కలెక్టర్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. పాఠశాలల్లో పని చేస్తున్న కార్మికులను తొలగించకూడదని విన్నవించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నాల రాజకుమారి, రాణి, శ్యాంసుందర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి



ఏటూరునాగారం: మండల పరిధిలోని రామన్నగూడెం వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల్లో ఉన్న వాగులు, వంకలు పొంగి పొర్లటంతో పాటు వరద నీరు గోదావరి నదిలోకి చేరటంతో రామన్నగూడెం వద్ద గోదావరి వరద నీటి మట్టం శనివారం సాయంత్రం 14.320 మీటర్లకు చేరుకుంది. క్రమక్రమంగా గోదావరి వరద ఉధృతి పెరుగుతోంది.

పేరూరులో 16 మీటర్లు..



వాజేడు: మండల పరిధిలోని పేరూరు వద్ద శనివారం సాయంత్రం గోదావరి 16 మీటర్లకు చేరుకుంది. గురువారం 14.70 మీటర్లు ఉండగా 1.30 మీటర్ల మేర పెరిగింది. దీంతో మండల పరిధిలోని టేకులగూడెం వద్ద 163 నంబర్ జాతీయ రహదారి నీటిలోనే ఉంది. కృష్ణాపురం, పేరూరు గ్రామాల మధ్యన మర్రిమాగు వాగు ద్వారా వచ్చిన గోదావరి నీరు రహదారిని ముంచెత్తింది. పూసూరు, ఏడ్జర్లపల్లి గ్రామాల మధ్యన బొమ్మనపల్లి వాగు ద్వారా వచ్చిన వరద బ్రిడ్జిని ముంచడంతో రాక పోకలు నిలిచిపోయాయి. వాజేడు, గుమ్మడి దొడ్డి గ్రామాల మధ్యన కొంగాల వాగు ద్వారా వచ్చిన గోదావరి రహదారిని ముంచేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పారిశుద్ధ్యం.. విషజ్వరాలు

- జిల్లాలో విజృంభిస్తున్న మలేరియా, టైఫాయిడ్, డెంగీ
- జీపీ కార్మికుల సమ్మెతో గ్రామాల్లో నిలిచిన పారిశుద్ధ్య పనులు
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఐదు రోజుల్లో ఓపీకి 1990 మంది హాజరు
- కొనసాగుతున్న ఇంటింటా జ్వర సర్వే

ఫోకస్ సాక్షి ఫోకస్


ములుగు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పేరుకుపోయిన చెత్త

ములుగు: జిల్లాలో వరుసగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు వర్షాలు, మరో వైపు గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెతో ఎక్కడి చెత్త అక్కడ పేరుకపోయింది. సాధారణంగా ఏజెన్సీలో సోకే జ్వరాలు ప్రస్తుతం రెట్టింపు అయ్యాయి. స్పందించిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మరింత వర్షాలు కురవకముందే అవసరమైన వైద్య సామగ్రిని సిద్ధం చేసుకున్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు జిల్లాలోని తొమ్మిది మండలాల్లో ఇంటింటా జ్వర సర్వే చేసేందుకు గానూ 45 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతీ బృందానికి ఒక్కో వైద్యాధికారి, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలను నియమించారు. ప్రతిరోజూ వారు గ్రామాల్లోకి వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. ఆరోగ్య సమస్య తీవ్రంగా ఉన్న వారిని ములుగు, ఏటూరునాగారం ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.


ములుగు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

ఐదు రోజులుగా ములుగు, ఏటూరునాగారం ఆస్పత్రుల్లో నమోదైన ఓపీ వివరాలు

తేదీ	ములుగు	ఏటూరునాగారం
18	280	68
19	260	38
20	300	78
21	360	90
22	400	116
మొత్తం	1,600	390



పక్క ఫొటోలోని వాజేడు మండల పరిధిలోని టేకులగూడెంకు చెందిన చిడెం సమ్మయ్యకు మూడు రోజులుగా జ్వరం రావడంతో ఆస్పత్రికి వచ్చారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌తో బాధపడుతున్నారు. ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రి పరిధిలో 17 మంది జ్వర పీడితులు ఉన్నారు. ఏడుగురికి టైఫాయిడ్, ముగ్గురికి డెంగీ పాజిటివ్‌గా తేలింది.



పై ఫొటోలో కనిపిస్తున్న డ్రెయినేజీ ములుగు జిల్లా కేంద్రంలోని సఫాయివాడ కాలనీలోనిది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పైనుంచి వస్తున్న వరద కారణంగా నిండిపోయింది. మురుగు నీరు కిందికి వెళ్లడానికి డ్రెయినేజీకి లింకు లేకపోవడంతో రోడ్డు మీదుగా ప్రవహిస్తోంది. దీంతో మురుగు పేరుకుపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. స్థానిక కాలనీ వాసులు రాత్రి పూట దోమల కారణంగా ఇబ్బంది పడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి డ్రెయినేజీలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఈ వ్యక్తి పేరు పసుపుల రాజు. ఇతనిది మంగపేట మండలం కమలాపురం. వారం రోజులుగా జ్వరం వస్తుంది. మలేరియా, టైఫాయిడ్, డెంగీ లక్షణాలు ఉండడంతో రక్త కణాల సంఖ్య తగ్గిపోయింది. ఏటూరునాగారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రక్తం ఎక్కించడానికి మూడు రోజుల సమయం పడుతుందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం వైద్య చికిత్సలు చేస్తున్నారు.



వెంకటాపురం(కె) మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహం సమీపంలోని ప్రధాన రహదారిపై చెత్తాచెదారం పేరుకుపోయింది. పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. జనవాసాల మధ్య దోమలు, ఈగల బెడద పెరుగుతుంది. రహదారి వెంట నడిచే స్థానికులు, వాహనదారులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. పంచాయతీ కార్మికులు విధుల్లోకి చేరని పక్షంలో ఈ సమస్య తీవ్రతరం కానుంది.

వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం



జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో దోమలు, ఈగల బెడద లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీల వారీగా వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. గ్రామాల్లో ఎక్కడైనా నీటి నిల్వలు ఉంటే గుర్తించి శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పాం. గ్రామ పంచాయతీలతో సమన్వయంగా మెదులుతూ ప్రజలకు సీజనల్ సమస్యలు రాకుండా చూడాలని సూచించాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంటింటా జ్వర సర్వే చేపట్టాలని ఆదేశాలు ఇచ్చాం. ప్రస్తుతానికి వర్షాకాలంలో సరిపడా మందులను అందుబాటులో ఉంచాం.

\- అల్లెం అప్పయ్య, డీఎంహెచ్‌ఓ

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ఎస్పీ గాష్‌ఆలం

ములుగు: ప్రజలకు పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఎస్పీ గాష్ ఆలం సిబ్బందికి సూచించారు. జిల్లా కేంద్రంలో పునరుద్ధరించిన సబ్ డివిజనల్ పోలీసు అధికారి కార్యాలయాన్ని శనివారం ఎస్పీ ప్రారంభించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో డీఎస్పీ రవీందర్, ములుగు, పస్రా సీఐలు రంజిత్‌కుమార్, శంకర్‌లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏఆర్ సదానందం, ములుగు ఎస్సై వెంకటేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

పోలీసు అధికారులు క్రమశిక్షణతో మెలగాలని ఎస్పీ గాష్ ఆలం సూచించారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని హెడ్ క్వాటర్స్‌లో ఏఆర్ అడిషనల్ ఎస్పీ సదానందం ఆధ్వర్యంలో పరేడ్ నిర్వహించారు. ఏఆర్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ అడ్మిన్ వెంకట్‌నారాయణ కమాండర్‌గా వ్యవహరించారు. ములుగు జిల్లాకు ప్రత్యేక బ్యాండ్ టీంను ఏర్పాటు చేయగా పని తీరును గమనించిన ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్సై సమ్మయ్య, రవిందర్, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.


సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ గాష్ ఆలం

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు


బైక్ మెకానిక్ షెడ్డు వద్ద అవగాహన కల్పిస్తున్న కృష్ణవేణి

ఏటూరునాగారం: బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని, ఆ యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఇనిస్టిట్యూషన్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కృష్ణవేణి తెలిపారు. మండల కేంద్రంలోని బైక్ మెకానిక్ సెంటర్లు, హోటళ్లు, ఇతర షాపుల్లో బాల కార్మికులపై శనివారం తనిఖీలు నిర్వహించారు. బడీడు పిల్లలను బడికి పంపించాలన్నారు. ఇటీవల గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్తాచెదారం ఎత్తిస్తున్న బాలకార్మికుడి విషయంలో జిల్లా లేబర్ ఆఫీసర్ వినోద స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారన్నారు. ఏటూరునాగారం జీపీ పరిధిలోని వార్డుల్లో చెత్తాచెదారం తొలగించడానికి వస్తున్న ప్రైవేట్ లేబర్ వివరాలను సేకరిస్తున్నారు. అయితే జీపీ అధికారులు ప్రైవేటు లేబర్ పేర్ల జాబితాను బయటకు ఇవ్వకపోవడం గమనార్హం. ఈ క్రమంలో లేబర్‌ను తీసుకువచ్చిన కాంట్రాక్టర్‌ను విచారిస్తున్నారు. అంతేకాకుండా ఇతర వ్యాపారులు, ఇళ్లలో సైతం బాల కార్మికులను పనిలో పెట్టుకోరాదని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ లైన్ సూపర్‌వైజర్‌లు విక్రమ్, సుదర్శన్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి


రోగికి అందిస్తున్న సేవలపై ఆరా తీస్తున్న పీఓ


విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ అంకిత్

- ఐటీడీఏ పీఓ అంకిత్

ఎస్ఎస్‌తాడ్వాయి: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన శనివారం సందర్శించారు. వైద్యాధికారి జిల్లా కేంద్రంలోని మిషన్ ఇంద్ర ధనస్సు శిక్షణకు వెళ్లారని ఓపీలో ఉన్న ఎంఎల్‌హెచ్ మెడికల్ ఆఫీసర్ పీఓకు వివరించారు. ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించిన పీఓ ఎంతమందికి వైద్య సేవలు అందించారు, ఓపీలో ఏ రకమైన వ్యాధులు నమోదయ్యాయని ఆరా తీశారు. వాతావరణ మార్పుల కారణంగా వైరల్ ఫీవర్, మలేరియా, దగ్గు, జలుబు ఎక్కువగా నమోదవుతున్నాయని మెడికల్ ఆఫీసర్ నివేదించారు. జూలై నెలలో క్యాంపుల షెడ్యూల్ తదితర వివరాలపై ఆరా తీసిన అనంతరం పీహెచ్‌సీలోని వార్డులను తనిఖీ చేసి ఓ రోగితో మాట్లాడారు. ఏ వ్యాధితో బాధపడుతున్నారని, స్వస్థలం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొండపర్తి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రాధాన్యత ప్రాతిపదికన చికిత్స అందించాలన్నారు. అనంతరం ల్యాబొరేటరీని పరిశీలించి, మలేరియా, డెంగీకి సంబంధించిన టెస్టింగ్ కిట్ల లభ్యత గురించి సెల్ కౌంటర్ల పనితీరు రియాజెంట్‌ల లభ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీపీఎంఓ సంజీవరావు, సిబ్బంది ఉన్నారు.

మల్యాల ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ

ఏటూరునాగారం: మండల పరిధిలోని మల్యాల ఆశ్రమ పాఠశాలను శనివారం పీఓ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, టిఫిన్ మెనూ ప్రకారం అందిస్తున్నది లేనిది, స్కూల్ యూనిఫామ్స్ అందరికీ అందింది లేనిది అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను సీఆర్‌టీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలోని వంట, తరగతి గదుల పరిసరాలను పరిశీలించి పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చర్యలు చేపట్టాలని సీఆర్‌టీలను ఆదేశించారు. వాటర్ కూలర్‌ను పరిశీలించి మరమ్మతులు చేయించాలని ఏటీడీఓను ఆదేశించారు.

పర్యాటకుల సందడి


జాలువారుతున్న మహితాపురం జలపాతం వద్ద పర్యాటకులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీరభద్రవరం గ్రామ సమీపంలోని ముత్యంధార జలపాతం, మహితాపురం గ్రామ సమీపంలోని మహితాపురం వాటర్ ఫాల్స్ వద్ద శనివారం పర్యాటకులు సందడి చేశారు. శనివారం పాఠశాలలకు సెలవు కావడంతో జలపాతాల వద్దకు పర్యాటకులు కుటుంబసభ్యులతో కలిసి తరలివచ్చారు. హైదరాబాద్, కరీం నగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జలపాతాల అందాలను వీక్షించారు.

ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పారదర్శకంగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ ములుగు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిధిలో నమోదైన ఓటర్లు, పాత ఓటర్లు, ఫారం 7, 8లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో తప్పిదాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఇంటింటా సర్వే నిర్వహించి గరుడ యాప్‌లో ప్రతీ ఒక్కరి వివరాలను నమోదు చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ విజయభాస్కర్, తహసీల్దార్ మధురకవి సత్యనారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

ములుగు: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హక్కుల సాధనలో భాగంగా చేపట్టిన సంకల్ప యాత్ర శనివారం ములుగు జిల్లాకు చేరింది. ములుగు మండలంలోని ఆలయం వద్ద ఉపాధ్యాయ, ఉద్యోగులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి జిల్లా కేంద్రం వరకు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ భద్రత లేని సీపీఎస్ విధానంతో భవిష్యత్‌లో ఉద్యోగులు ఇబ్బందులు పడతారని తెలిపారు. సీపీఎస్ విధానం రాష్ట్ర పరిధిలోని అంశం అని, రద్దు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. అయినా మాయ మాటలు చెప్పుకుంటూ కేంద్రంపై నెట్టివేయడం సరికాదన్నారు. ఇందులో భాగంగా వచ్చేనెల 12వ తేదీన చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అన్నవరం రవికాంత్, మంకిడి రవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంకిడి బుచ్చయ్య, టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్, టీడబ్ల్యూటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పొదెం కృష్ణ ప్రసాద్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఏళ్ల మదుసూధన్, తెలంగాణ ఎంప్లాయిస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు గుల్లగట్టు సంజీవ, ఆయా సంఘాల బాధ్యులు హట్కర్ సమ్మయ్య, యాకూబ్‌రెడ్డి, సర్వర్ అహ్మద్, జనగాం బాబురావు, మైపతి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు

ఏజెన్సీలో ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పర్యటన

మంగపేట: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శనివారం ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ శిరిశెట్టి సంకీర్త్ ఐజీకి పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. పోలీస్ శాఖ తరపున గౌరవ వందనం సమర్పించారు. అనంతరం స్టేషన్‌లో వర్టికల్ పనితీరును ఐజీ పరిశీలించారు. అధికారులకు తగిన సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం సీఐ రాజు, మంగపేట ఎస్సై తాహెర్‌బాబ, సిబ్బంది పాల్గొన్నారు.


ఐజీకి పూల మొక్క అందజేస్తున్న ఏఎస్పీ సంకీర్త్

పరిశోధనలతో ఉత్తమ ఫలితాలు

- ఆరోగ్య వర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి
- కేఎంసీలో రీసెర్చ్ డే

ఎంజీఎం: విద్యార్థులు ప్రస్తుతం వస్తున్న జబ్బులపై పరిశోధన చేయడానికి క్లినికల్ వైద్యంతో పాటు రీసెర్చ్ దిశగా అడుగులు వేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కాళోజీ ఆరోగ్య వర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కాకతీయ మెడికల్ కళాశాలలో యూఏఏ అల్యుమ్ని (పూర్వ విద్యార్థులు) శనివారం రీసెర్చ్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆరోగ్య వర్సిటీ వీసీ కరుణాకర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమానికి 30 కళాశాలల నుంచి 50 మందిని ఆహ్వానించగా.. వీరికి పలు రంగాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభను పరిశీలించారు. ఈసందర్భంగా కేఎంసీలోని ఎన్ఆర్ఐ హాల్‌లో రీసెర్చ్‌పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, కళాశాల సెమినార్ హాల్స్‌లో గ్రూపు డిబేట్స్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన అల్యుమ్ని ఎడ్యుకేషన్ కోచైర్మన్ డాక్టర్ సుజిత్, పున్నం, అనుపమ, వేణును అభినందించారు. అల్యుమ్ని కో–చైర్మన్ డాక్టర్ సుజిత్ మాట్లాడుతూ.. దేశంలోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు విదేశాలతో పోలిస్తే ఇక్కడ శిక్షణ పొందిన వైద్య నిపుణులు తక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ మాట్లాడుతూ.. ఈకార్యక్రమం యూజీ స్థాయిలోనే పరిశోధనలు చేయాలనే ఆలోచన రేకెత్తించి విద్యార్థులను లక్ష్యసాధన దిశగా అడుగులు వేసేలా ముందుకు తీసుకెళ్తుందన్నారు. ఈపోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఐఎంఏ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వద్దిరాజు రాకేశ్, ఆరోగ్య వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ కరుణాకర్‌రెడ్డి

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే సీతక్క

ములుగు: నూతనంగా ములుగు కలెక్టర్‌గా నియమించబడిన ఇలా త్రిపాఠిని శనివారం ములుగు ఎమ్మెల్యే సీతక్క మర్యాద పూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి, మండల వర్కింగ్ కమిటీ అధయక్షుడు నల్లెల భరత్‌కుమార్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పొడాల ఓం ప్రకాశ్, ఎంపీటీసీ మావురపు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి కృషి : సీపీ



మాట్లాడుతున్న సీపీ ఏవీ.రంగనాథ్

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తించే సిబ్బంది సంక్షేమానికి కృషిచేస్తానని, వారికి నిరంతరం అందుబాటులో ఉంటానని పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ తెలిపారు. భీమారంలోని శుభం ఫంక్షన్‌హాల్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్, హోంగార్డ్స్ సిబ్బందితో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నక్సల్స్ నియంత్రణలో వరంగల్ పోలీసులకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సరెండర్, టీఏ, బకాయిలు త్వరలోనే అందుకుంటారని ఆయన తెలిపారు. విధుల్లో ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా అవకాశాన్ని బట్టి వెసులుబాటు కల్పించనున్నట్లు, ప్రతి నెలా సిబ్బంది సంక్షేమం కోసం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సిబ్బంది సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చే విధంగా విభాగాల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. డాక్టర్లు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యలతో మాట్లాడి రాయితీలు కల్పిస్తామని, 40 సంవత్సరాలు పైబడిన వారికి మాస్టర్ హెల్త్ చెకప్, ఆకస్మికంగా మరణించిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం కింద ఒక రోజు వేతన పథకాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. హోంగార్డు సిబ్బంది గ్రూపు ఇన్సూరెన్స్ కోసం సంబంధిత కంపెనీలతో మాట్లాడానని చెప్పారు. పరిపాలన విభాగం డీసీపీ పుష్పారెడ్డి, ట్రెయినీ ఐపీఎస్ అధికారి అంకిత్, అదనపు డీసీపీలు సంజీవ, సురేష్‌కుమార్, ఏసీపీలు నాగయ్య, అనంతయ్య, ఏఓ ఆర్ కే.స్వామి, ఆర్ఐలు చంద్రశేఖర్, నగేష్, భాస్కర్, సతీష్, కేయూ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య, పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధి శోభన్, పరిపాలన విభాగం సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన సమీపం నుంచి తరలిపోతున్న వరదనీరు

గోదావరి పెరుగుతూ.. తగ్గుతూ

జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులు పెరుగుతూ.. తగ్గుతూ ప్రవహిస్తున్నాయి. శనివారం సాయంత్రం కాళేశ్వరం పుష్కరఘాటు వద్ద 11.150మీటర్లు ఎత్తులో నీటి మట్టం ప్రవహిస్తోంది. ఎగువన గోదావరి, ప్రాణహిత నదుల గుండా వరద అర్ధరాత్రి నుంచి పెరిగి శనివారం ఉదయం 10గంటల వరకు 11.520మీటర్లు ఎత్తులో ప్రవహించింది. తరువాత తగ్గుతూ సాయంత్రం 6గంటల వరకు 11.150మీటర్లకు చేరింది. ఎగువ తెలంగాణ, మహారాష్ట్రల నుంచి వరద నీరు తరలి వచ్చి కాళేశ్వరం మీదుగా దిగువన మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీ వైపునకు తరలిపోతోంది.

- కాళేశ్వరం

పోలీస్ శాఖలో ఎన్నికల ఎఫెక్ట్



- ఉన్నతాధికారుల బదిలీ
- భారీగా ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ల ట్రాన్స్‌ఫర్
- నేతల చుట్టూ అధికారుల ప్రదక్షిణలు!
- బదిలీలకు ఈనెల 31 టార్గెట్

వరంగల్ క్రైం: పోలీసుశాఖలో బదిలీలు భారీగా జరుగుతున్నాయి. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేడి అనధికారికంగా ప్రారంభమైంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డీసీపీ స్థాయి అధికారి నుంచి సబ్ ఇన్‌స్పెక్టర్ అధికారి వరకు ఎన్నికల ఎఫెక్ట్‌లో భాగంగా బదిలీలు జరుగుతున్నాయి. జాతీయ ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనరేట్ల కమిషనర్లు, ఎస్పీలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను నియమించారు. దీంతో ఎన్నికల ప్రక్రియ వేగం పుంజుకుంది. దీనికి అనుగుణంగా ఎన్నికల సమయంలో కీలకపాత్ర పోషించే పోలీస్ శాఖలో భారీగా మార్పులు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అధికారుల ఎంపిక విషయంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు మార్గనిర్దేశం చేసినట్లు సమాచారం. దానికి అనుగుణంగా ఎన్నికల నిబంధనలు వర్తించే పోలీస్ అధికారులను ఆయా నియోజకవర్గాలకు సాగనంపుతున్నారు. దీంతోపాటు ఎన్నికల సమయంలో సామాజిక సమీకరణాలతో పాటు ఏమేరకు ఎన్నికల విధుల్లో ఉపయోగపడుతారనే కోణంలో క్షుణంగా పరిశీలించిన తర్వాతనే పోస్టింగ్‌లకు సిఫార్సు చేస్తున్నట్లు సమాచారం.

ఉన్నతాధికారుల బదిలీ

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పని చేసే ఇద్దరు డీసీపీలు పుల్లా కరుణాకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీగా, కర్రి పుష్పారెడ్డి తెలంగాణ కమాండ్ కంట్రోల్ విభాగం ఎస్పీగా బదిలీ అయ్యారు. వీరితో పాటు పరకాల, కాజీపేట, మామునూరు, క్రైం, ఏసీపీలు బదిలీ అయ్యారు. ఇన్‌స్పెక్టర్లు.. పరకాల, గీసుకొండతో పాటు కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. దీంతోపాటు చాలా కాలంగా ఖాళీగా ఉన్న హసన్‌పర్తి, కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లకు ఖమ్మం, కొత్తగూడెం నుంచి వచ్చిన ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు కేటాయించారు. కోడ్ ఎఫెక్ట్‌లో భాగంగా సుబేదారిలోని రూరల్ మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్, భరోసా ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. గత నాలుగైదు రోజుల్లో వరుసగా సబ్ ఇన్‌స్పెక్టర్లను వివిధ పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేస్తూ.. వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేతల చుట్టూ అధికారుల ప్రదక్షిణలు!

ఎన్నికల ముందు ప్రశాంతత కోసం కొంత మంది అధికారులు లూపులైన్ల కోసం ప్రయత్నాలు సాగిస్తుండగా.. మరికొంత మంది ఎన్నికల కోడ్ వర్తించని చాలామంది అధికారులు సిఫారసు లేఖల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈసమయంలో నాయకులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఏమేరకు ఉపయోగపడతారని వారి అనుచర గణంతో లెక్కలు వేసుకుంటున్నారు. అధికారి పనితీరుతో పాటు సామాజిక అంశాన్ని ప్రధానంగా చూస్తున్నారు. ఒక్కో పోస్టింగ్ కోసం పదుల సంఖ్యలో అధికారులు క్యూ కట్టడం విశేషం. ఏసీపీ పోస్టుల కోసం కూడా అధికారులు ఒక్కో ప్రజాప్రతినిధిని పలుమార్లు కలుస్తున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న కొంత మంది అధికారులు వారి పీరియడ్ పూర్తి కాకపోయినప్పటికీ పోస్టింగ్ ఉంటుందో? ఉడుతుందో.. తెలియని అయోమయ స్థితిలో ఉద్యోగం నెట్టుకొస్తున్నారు. వరంగల్ సబ్ డివిజన్‌లో మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్ వర్ధన్నపేట, ధర్మసాగర్, కమలాపూర్, నర్సంపేట, రఘునాథపల్లి, నర్సంపేట రూరల్, నర్మెట్ట పోలీస్‌స్టేషన్లకు కొత్త అధికారులు రానున్నారు. ఈపోస్టింగ్‌ల కోసం ఇప్పటికే చాలా మంది అధికారులు ప్రజాప్రతినిధుల నుంచి లెటర్లు పోలీస్‌బాస్‌కు అందించినట్లు సమాచారం. ఇందులో కొంత మందికి ఎలక్షన్ ఎఫెక్ట్ ఉండగా.. మరికొంత మంది ప్రవర్తన సరిగ్గా లేక మార్పు ఖాయమనే ప్రచారం జరుగుతోంది.

అరెస్టులకు రంగం సిద్ధం!

పోలీసు అధికారుల లెక్కల ప్రకారం వివిధ కేసుల్లో ఇప్పటి వరకు అరెస్టు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న సుమారు 180 మంది నిందితుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. వీరిని అరెస్ట్ చేయడానికి ఇప్పటికే ఉన్నతాధికారుల నుంచి ఎస్‌హెచ్‌ఓలకు నిర్దిష్టమైన ఆదేశాలు అందాయి. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపనున్నారు. దీంతో పాటు ఆయా పోలింగ్‌స్టేషన్ల వారీగా మాజీలతో పాటు గతంలో జరిగిన ఎన్నికల్లో ఇబ్బదులు సృష్టించిన వ్యక్తుల జాబితాలు కూడా ఆయా పోలీస్‌స్టేషన్లలో సిద్ధంగా ఉన్నాయి.

తుపాకుల జాబితా రెడీ..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తుపాకుల లైసెన్స్‌లు 230 ఉన్నాయి. ప్రస్తుతం తుపాకుల లైసెన్స్ కలిగిన వ్యక్తులు వివిధ గొడవల్లో చిక్కుకున్న, కేసులు నమోదైన వారి లైసెన్స్‌లు రద్దు చేశారు. దీంతో కమిషనరేట్ పరిధిలో 180 వరకు లైసెన్స్ తుపాకులున్నాయి. ఎన్నికల ముందు వీటిని ఆయా పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. తుపాకుల లెక్కలను సైతం పోలీసు అధికారులు సిద్ధం చేసి ఉంచారు.

ఈనెల 31 వరకు ప్రక్రియ పూర్తి చేస్తాం..



కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఈనెల 31వ తేదీ వరకు ఎన్నికల బదిలీ ప్రక్రియను పూర్తి చేస్తాం. సొంత జిల్లా, సొంత నియోజవర్గం ఉన్న అధికారులతో పాటు చివరి నాలుగేళ్లలో మూడు సంవత్సరాలు ఒకే దగ్గర పనిచేసే అధికారులను నిబంధనల ప్రకారం బదిలీ చేస్తాం. ప్రస్తుతం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పని చేస్తున్న అధికారులను రెవెన్యూ జిల్లాను ప్రతిపాదికన బదిలీలు చేపడుతున్నాం. ఏసీబీ, క్రిమినల్ కేసులు ఉన్న అధికారులను ఎన్నికల విధులకు దూరంగా ఉంచుతాం.

- ఏవీ.రంగనాథ్, వరంగల్ పోలీస్ కమిషనర్

నిర్లక్ష్యపు డ్రైవింగ్..

- అదుపు తప్పి ఆటోను ఢీకొని షాపులోకి దూసుకెళ్లిన బైక్
- తప్పిన పెను ప్రమాదం



మగ్గం వర్క్ దుకాణంలో ప్రమాద ఘటన

జనగామ: ఓ ద్విచక్రవాహనదారుడి నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల పదిమందికి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన శనివారం జనగామ పట్టణంలో జరిగింది. జనగామకు చెందిన ఓ యువకుడు బైక్‌పై స్వర్ణకళామందిర్ రోడ్డు వైపు అతివేగంగా వచ్చాడు. అదే సమయంలో ఓ ఆటోలో ముగ్గురు కుటుంబ సభ్యులు దశరథ, ఆయన భార్య, తన కూతురు కిరాణా సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చారు. దశరథ దుకాణంలోకి వెళ్లగా.. భార్య, కూతురు ఆటోలోనే ఉన్నారు. ఈ క్రమంలో బైక్‌పై వేగంగా వచ్చిన యువకుడు అదుపుతప్పి ఆటోను ఢీకొడుతూ దుకాణం పక్కన ఉన్న ఉద్విత మగ్గం వర్క్స్ షాపులోకి దూసుకెళ్లాడు. మగ్గం వర్క్ షాపు ఎదుట యజమాని బైక్ ఉండడంతో.. ఆటో మరింత లోపలికి వెళ్లకుండా అడ్డు తగిలింది. ఆ సమయంలో ఆటోలో ఇద్దరు, దుకాణంలో నలుగురు, బయట మరికొంత మంది ఉండగా త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. క్షణాల్లో జరిగిన ఘటనతో స్థానికులు భయంతో పరుగులు పెట్టారు. ద్విచక్రవాహనదారుడితోపాటు అందరూ క్షేమంగా ఉన్నారు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై అరుణ్ కుమార్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా. స్థానిక పోలీస్ స్టేషన్, డీసీపీ కార్యాలయంతో పాటు నెహ్రూపార్కు, ఆర్టీసీ చౌరస్తా, తదితర చోట్ల కొందరు బైక్ రేసింగ్, అతివేగం డ్రైవింగ్‌తో విన్యాసాలు చేస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాయిదా పడిన కేయూ పరీక్షల రీషెడ్యూల్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 20, 21, 22వ తేదీల్లో వాయిదా పడిన వివిధ పరీక్షల రీషెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక.. శనివారం విడుదల చేశారు. వాయిదాపడిన బీ ఫార్మసీ 8వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 27న , 22న జరగాల్సిన పరీక్షలు ఆగస్టు 1న , బీ ఫార్మసీ 7 సెమిస్టర్ పరీక్షలు ఈనెల 31న నిర్వహిస్తారు. ఫార్మ డీ మూడో సంవత్సర పరీక్షలు ఆగస్టు 9న , ఫార్మ డీ నాలుగో సంవత్సర పరీక్షలు ఆగస్టు 10వ తేదీన, ఫార్మ డీ 5వ సంవత్సర పరీక్షలు ఆగస్టు 8వ తేదీన నిర్వహిస్తామని పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

బీటెక్ (సీబీసీఎస్)

కేయూ పరిధిలో వాయిదాపడిన బీటెక్ సీబీసీఎస్ పరీక్షల వివరాలు ఇలా ఉన్నాయి. బీటెక్ రెండో సంవత్సర రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24న, బీటెక్ మూడో సంవత్సర రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25న నిర్వహిస్తారు.

బీటెక్ (నాన్ సీబీసీఎస్)పరీక్షలు ఇలా..

బీటెక్ మొదటి సంవత్సర పరీక్షలు ఈనెల 26న, బీటెక్ నాలుగో సంవత్సర మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26న, బీటెక్ మూడో సంవత్సర మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 31న , బీటెక్ మూడో సంవత్సర రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 31న, బీటెక్ రెండో సంవత్సర మొదటి సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 1న, బీటెక్ రెండో సంవత్సర రెండో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు1న నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. మిగతా పరీక్షలు యథావిధిగా నిర్వహిస్తామన్నారు.

ఫాదర్ కొలంబో కలలు సాకారం..

- ఇటలీ పోప్ దూత, భారత్–నేపాల్ రాయబారి లియోపోల్డో జిరెల్లి



ఫాదర్ కొలంబో వైద్యకళాశాల ప్రాంగణంలో భూమి పూజ చేస్తున్న పోప్‌దూత లియోపోల్డో జిరెల్లి, ముంబయి, గోవా, కార్డినల్స్, ఓరుగల్లు పీఠాధిపతి ఉడుముల బాల

కాజీపేట రూరల్: పేదల ఆరాధ్యుడు ఫాదర్ కొలంబో కలలు సాకారం కావడం సంతోషంగా ఉందని ఇటలీ పోప్ దూత, భారత్, నేపాల్ రాయబారి లియోపోల్డో జిరెల్లి అన్నారు. వరంగల్ హంటర్‌రోడ్ బ్రిడ్జి సమీపంలో గల కొలంబో వైద్యశాల ప్రాంగణంలో శనివారం ఫాదర్ కొలంబో వైద్యవిద్యా కళాశాల ఆశీర్వాద వేడుక, బీఎస్సీ నర్సింగ్ విద్య, పారా మెడికల్ కళాశాలల భూమి పూజకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలంబో వైద్యకళాశాల వేడుకలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం రాత్రి జరిగిన దివ్య బలిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముంబయి కార్డినల్ ఒస్వాల్ట్ గ్రాషియాస్ మాట్లాడుతూ దేశంలో మణిపూర్ ఘటనలు పునరావృతం కావొద్దన్నారు. దేశంలో మానవులు అందరూ సమానులేనని, ఒకరిపట్ల ఒకరు ప్రేమతో ఉండేలా క్రీస్తును ఆరాధించాలని పేర్కొన్నారు. అంతకు ముందు ఫాతిమానగర్ బిషప్ హౌజ్ ప్రాంగణం నుంచి వరంగల్ మెడికేర్ ఆస్పత్రి వరకు లియోపోల్డోను ప్రత్యేక కారులో ర్యాలీగా తీసుకెళ్లారు. వరంగల్, ఖమ్మం మేత్రాసనం పీఠాధిపతి డాక్టర్ ఉడుముల బాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గోడా డామన్ కార్డినల్ పిలిప్పైరి పెర్రావో, ఏలూరు. కడప, విజయవాడ, బెల్లారి, శ్రీకాకుళం, శంషాబాద్ పీఠాధిపతులు పొలిమెర జయరావు, గాలిబాల, టి.జోసెఫ్‌రాజారాం, హెన్ని డిసౌజ, విజయ్‌కుమార్, రాపెల్ తట్టల్, మెడికేర్ ఆస్పత్రి డైరెక్టర్ చిన్నప్ప, ఫాదర్ జోసెఫ్, కొలంబో వైద్య శాల నిర్వాహకులు, ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ జిల్లాల నుంచి ఫాదర్లు, సిస్టర్లు, బ్రదర్లు, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

ప్రవాహ పరవళ్లు..



అన్నారం బ్యారేజీలో గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న వరద నీరు



సమ్మక్క సాగర్ వద్ద తరలుతున్న నీరు

- కాళేశ్వరం బ్యారేజీలకు భారీగా వరద నీరు
- లక్ష్మీలో 75, సరస్వతీబ్యారేజీలో 35గేట్లు ఎత్తివేత

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ (లక్ష్మి), అన్నారం(సరస్వతి)బ్యారేజీలకు వరద నీరు పోటెత్తింది. దీంతో శనివారం ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు ఆయా బ్యారేజీల్లో గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. కాగా, నాలుగు రోజుల నుంచి గోదావరి, ప్రాణహిత నదులకు వరద పోటెత్తుతోంది. ఫలితంగా కాళేశ్వరం వద్ద 11.150మీటర్ల ఎత్తులో నీటిమట్టం కొనసాగుతోంది.

35గేట్లు ఎత్తివేత:

ఎగువన ఎస్సారెస్పీ, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో గేట్లు ఎత్తడంతో గోదావరి గుండా దిగువన జయశంకర్ భూపాలపల్లి జిల్లా అన్నారం (సరస్వతి) బ్యారేజీకి వరద తాకిడి మూడు రోజుల నుంచి పెరిగింది. ఆ బ్యారేజీలో మొత్తం 66 గేట్లు ఉండగా 35 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. గోదావరి నుంచి ఇన్‌ఫ్లో 2,25,000లక్షల క్యూసెక్కులు తరలి రాగా, గేట్లు ఎత్తడంతో దిగువకు కాళేశ్వరం వైపునకు 1,03,500లక్షల క్యూసెక్కులు అవుట్‌ఫ్లో తరలి దిగువకు వెళ్తున్నాయి. బ్యారేజీ సామర్థ్యం 10.87 టీఎంసీలకు గాను ప్రస్తుతం 2.36 టీఎంసీలు ఉంది. ఎగువ నుంచి తరలివచ్చే నీరు దిగువన కాళేశ్వరం చేరుతోంది.

లక్ష్మీబ్యారేజీ 75 గేట్లు ఎత్తివేత

ఎగువ మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నది, అటు గోదావరి నదుల ప్రవాహాలు కలిసి భారీ స్థాయిలో వరద నీరు లక్ష్మీబ్యారేజీకి చేరుతోంది. దీంతో ఇన్‌ఫ్లో 6,10,250లక్షల క్యూసెక్కులు ప్రవహిస్తోంది. వరద ఉధృతి పెరుగుతుండడంతో బ్యారేజీలో మొత్తం 85గేట్లు ఉండగా 75 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. అవుట్‌ఫ్లో 6,10,250 లక్షల క్యూసెక్కులు దిగువకు తరలిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఉధృతిని ఇంజనీరింగ్ అధికారులు సమీక్షిస్తున్నారు.

సమ్మక్క సాగర్ వద్ద ..

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుతోంది. ఉదయం బ్యారేజీ వద్ద 825380 క్యూసెక్కుల నీరు చేరగా సాయంత్రం 879450 క్యూసెక్కులకు చేరింది. దీంతో అదే స్థాయిలో బ్యారేజీలో ఉన్న 59 గేట్లను ఎత్తి దిగువకు 87450 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం 82.5 మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది.

అంత్యక్రియలకు వెళ్తూ అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
- మొగుళ్లపల్లిలో ఘటన



దుర్గేశం (ఫైల్)

మొగుళ్లపల్లి: బంధువు అంత్యక్రియలకు బయలుదేరిన ఓ వ్యక్తి.. అనంతలోకాలకు వెళ్లాడు. ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని వేములపల్లి గ్రామానికి చెందిన పోతుగంటి దుర్గేశం (53) మండల కేంద్రంలోని తన బంధువు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు భార్య ప్రభావతితో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో మొగుళ్లపల్లి పెద్దవాగు బ్రిడ్జి వద్ద మలుపు తిరుగుతున్నాడు. చిట్యాల మండలం చల్లగరిగె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కారులో మండల కేంద్రం మీదుగా జమ్మికుంటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న దుర్గేశం దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుతుండగా మార్గమధ్యలో దుర్గేశం మృతి చెందాడు. తీవ్ర గాయాల పాలైన ప్రభావతిని మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించారు.